మహిళల రక్షణ కవచం దిశా యాప్

రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్



ఫోన్‌లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న రూరల్ సీఐ ఎ.శివశంకర్, ఎస్ఐ కొండారెడ్డి

చెరుకుపల్లి: ఆపదలో ఉన్న మహిళలను నిమిషాల వ్యవధిలో కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన దిశా యాప్ మహిళలకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ అన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధ, గురువారాలు మండల కేంద్రంలోని ఐలాండ్ సెంటరులో దిశాయాప్ డైన్‌లోడ్ స్పెషల్ డ్రైవ్ న్విహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను నివారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశా యాప్ ఇప్పటి వరకు మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం అందించి వారికి భరోసా కల్పిస్తుందన్నారు. ఇంతటి ఉపయోగకరమైన యాప్‌ను హ్యాండ్ రైడ్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. స్థానిక ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి, ఏఎస్సైలు బ్రహ్మం, శ్రీనివాసరావు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో పట్టణ విద్యార్థి ప్రతిభ



దివి కేశవ కుమార్



బి. నాగవెంకట లక్ష్మీరుహాన్సీ

రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలలో పట్టణంలోని 4వ వార్డుకు చెందిన దివి కేశవకుమార్ 434వ ర్యాంక్ సాధించి ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. 10వ తరగతి వరకు స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ బైపీసీ విజయవాడలోని శ్రీ చైతన్య కాలేజీలో చదివాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు కోటేశ్వరరావు, పద్మలు తమ కుమారుడు సాధించిన ప్రతిభకు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. నీట్ మెడికల్ విభాగంలోనూ 642 మార్కులు సాధించి ప్రతిభ కనపరచటం ఆనందంగా ఉందని తెలిపారు.

661వ ర్యాంక్‌తో ప్రతిభచాటిన నాగవెంకట లక్ష్మీ రుహాన్సీ..

రేపల్లె: పట్టణంలోని 9వవార్డుకు బొలిశెట్టి నాగవెంకటలక్ష్మీ రుహాన్సీ ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో 661వ ర్యాంకు సాధించి ప్రతిభ కనపరిచింది. 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లు కంకిపాడులో పూర్తి చేసింది. కిరాణా దుకాణం నిర్వహించే బొలిశెట్టి పూర్ణచంద్రరావు, శిరీషలు తమ కుమార్తె సాధించిన ప్రతిభకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించాలి

చెరుకుపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లోని జాబ్ కార్డు ఉన్నవారందరికీ తప్పకుండా పని కల్పించాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు, సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100రోజులు పని కల్పించాలని వారికి ప్రతి రోజు కనీస వేతనం రూ.250, గరిష్ఠ వేతనం రూ.272 అందించాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని వీరితో పాటు ఎస్సీ, ఎస్టీలకు 100రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ ఆర్.భవాని, ఏపీఓ జె.లక్ష్మీ, ఈసీ డి.అరుణ, టీఏలు మోహన్, శ్రీనివాసరావు, బీఎఫ్‌టీ విజయలక్ష్మీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.